మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ రామస్వామినాయక్, మాజీ ఎంపీపీ ప్రకాశ్‌రావు

హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

ఖానాపురం, మే 29 : నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాలతో రద్దు చేసిన సొసైటీ పాలకవర్గాలను తిరిగి కొనసాగించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టులాంటిదని స్థానిక సొసైటీ చైర్మన్ గుగులోత్ రామస్వామి నాయక్, బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు అన్నారు. ఈ మేరకు గురువారం మండలకేంద్రంలోని సొసైటీ కార్యాలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. నర్సంపేట నియోజకవర్గంలో ఐదు సొసైటీలకు బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే చైర్మన్లుగా ఉన్నారనే అక్కసుతో స్థానిక ఎమ్మెల్యే దొంతి అధికారాన్ని అడ్డం పెట్టుకుని రద్దు చేశాడని ఆరోపించారు. ఐదేళ్లుగా ఖానాపురం సొసైటీని జిల్లాలోనే ఉత్తమంగా తీర్చిదిద్దామన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా రైతులకు సేవలందించామని చెప్పారు. అయినా సొసైటీలో అవినీతి జరిగిందని రద్దు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఐదు సొసైటీల రద్దు వెనుక కాంగ్రెస్ పార్టీ కుట్ర దాగుందన్నారు. గతంలోనే హైకోర్టు పాలకవర్గాన్ని కొనసాగించాలని ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ అమలు చేయలేదన్నారు. మరోసారి హైకోర్టును ఆశ్రయించి కంటెంట్ పిటిషన్ దాఖలు చేయడంతో ఈ నెల 26న పాలకవర్గం కొనసాగేలా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. గతంలో పనిచేసిన స్ఫూర్తితో సంఘాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం పాలకవర్గ సభ్యులు బాధ్యతలు చేపట్టి, పటాకులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహాలక్ష్మీ వెంకటనర్సయ్య, సొసైటీ పాలకవర్గ సభ్యులు ఆబోతు అశోక్, నీలం సాంబయ్య, రవీందర్‌రావు, సునీత, భాగ్యమ్మ, కుమారస్వామి, తిరుపతి, లక్ష్మణ్, రమేశ్, బీఆర్ఎస్ నాయకులు, సొసైటీ సీఈవో ఆంజనేయులు, సిబ్బంది రాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

'నెక్కొండ' చైర్మన్‌గా రాము బాధ్యతల స్వీకరణ

చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మారం రాము, సభ్యులు

నెక్కొండ, మే 29 : హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా నెక్కొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ చైర్మన్‌గా మారం రాము గురువారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. పీఐసీ సభ్యులుగా మోడెం వెంకన్న, రావుల హరీశ్‌రెడ్డి, తాటిపర్తి నాగేంద్రమ్మ, కొయ్యడ వెంకన్న, కేతిరెడ్డి లక్ష్మి, వీ.లక్ష్మి, జంగిలి లక్ష్మి, పొరండ్ల రాంచందర్, తేజావత్ గోపి, లావుడ్యా యాకూబ్, సింగారపు కమలమ్మ, సొరపు శ్రీను, రెడ్డబోయిన కుమారస్వామి నియమితులయ్యారు. కాగా, రాముకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, సీనియర్ నాయకులు కొమ్ము రమేశ్‌యాదవ్, సొసైటీ మాజీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి తాటిపెల్లి శివకుమార్, మాజీ ఉప సర్పంచ్ దేవనబోయిన వీరభద్రయ్య, మండల నాయకులు కారింగుల సురేశ్, మైనార్టీ నాయకులు ఖలీల్ శుభాకాంక్షలు తెలిపారు.

నూతన పాలకవర్గాన్ని సన్మానిస్తున్న నాయకులు

బాధ్యతలు చేపట్టిన నాచినపల్లి పాలకవర్గం

దుగ్గొండి, మే 29 : కాంగ్రెస్ పార్టీ కుట్రలను ఎదుర్కొని హైకోర్టు ఆదేశాలతో నాచినపల్లి సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిగా సుకినె రాజేశ్వర్‌రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు సొసైటీ ఆవరణలో ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేసిందన్నారు. సీ గ్రేడ్‌గా ఉన్న సంఘాన్ని ఏ గ్రేడ్‌గా మారేందుకు కృషి చేశామన్నారు. నిరంతరం రైతులకు అందుబాటులో ఉంటామన్నారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన చైర్మన్, డైరెక్టర్లను మాజీ ప్రజాప్రతినిధులు వడ్డేపల్లి చంద్రమౌళి, గుడిపెల్లి జనార్దన్‌రెడ్డి, నాతి వెంకటేశ్వర్లు తదితరులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు నల్ల శ్యాంసుందర్‌రెడ్డి, గొసంగి పురుషోత్తం, తుమ్మల పల్లి బాబు, హన్మకొండ లలిత, సురవు సంజీవరావు, మెకిడె ప్రభాకర్, నరహరి భాస్కర్‌రెడ్డి, నాయకులు బోరాల లింగయ్య, గొర్రె జనార్దన్‌రెడ్డి, నర్ర రంగారెడ్డి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE
★Hnk గోపాలపూర్ భద్రకాళి కాలనీ రోడ్ నెంబర్ 2 లో ఈస్ట్ ఫేసింగ్ 300 స్క్వేర్ యార్డ్స్ 30 ఫీట్ల రోడ్డు మంచి వాస్తు క్లియర్ టైటిల్ గల ప్లాటు అమ్మబడును No Brokers cont : 8790501225 and 99499 12347.
NTW-000

WANTED
★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.
NT-325336

CHANGE OF NAME
My Name in Old passport MAMIDALA ANNAPOORNA W/o PRAKASH MAMIDALA R/o H. No. 1-9-965, Postal Colony, Hanamkonda 506001, Telangana state, is now changed into MAMIDALA ANNAPURNA W/o MAMIDALA PRAKASH and for all purposes.
NTW-17664

CHANGE OF NAME
★ I, SYED FATIMATUZUHRA (Old Name) R/o H.No. 7-7-214, Ujlibase, Alankar, HanamKonda Dist-506011, T.G, Have Changed my name SYED FATIMATUZUHRA to from SYEDA FATHIMUZZUHARA (New Name) W/o MIRZA AMJADULLAH BAIG for all future purposes.
NTW-6587

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

మోడల్ టెక్స్‌టైల్ పార్క్‌గా గుర్తింపు తీసుకురావాలి

కలెక్టర్ డాక్టర్ సత్య శారద

ఖిలావరంగల్, మే 29 : స్థానిక వృత్తిదారుల సహకారంతో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను మోడల్ టెక్స్‌టైల్ పార్కుగా గుర్తింపు తీసుకువచ్చేందుకు కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. గురువారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో డైరెక్టర్ ఆఫ్ టెక్స్‌టైల్ ధరణికాంత్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి, ఉద్యోగ అవకాశాల సృష్టికి, స్థానికుల ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కీలక పాత్ర పోషిస్తున్నదన్నారు. టెక్స్‌టైల్ రంగంలో సమగ్ర మౌలిక సదుపాయాలు అందించడంతోపాటు మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ముందున్నదన్నారు. డీఆర్డీఏ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు శిక్షణ ఇప్పించామన్నారు. అలాగే, టెక్స్‌టైల్ పార్క్‌లో భూమి కోల్పోయిన నిర్వాసితుల ఇండ్ల స్థలాలకు కుడా లేఅవుట్ అనుమతులు, మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కేఎంటీ జోనల్ మేనేజర్ స్వామి, గీసుగొండ, సంగెం మండలాల తహసీల్దార్లు రియాజోద్దీన్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సత్య శారద

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

లక్ష్మారెడ్డి(ఫైల్)

నల్లబెల్లి, మే 29 : విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన ఘటన నల్లబెల్లి మండలంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని దస్తగిరిపల్లె గ్రామానికి చెందిన మాందాడి లక్ష్మారెడ్డి(22) తన ఇంటి సమీపంలో ఉన్న వ్యవసాయ బావి నుంచి ఇంటి అవసరాల కోసం మోటరు పెట్టేందుకు కరెంట్ పోల్‌కు వైరు తగిలిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు షాక్‌కు గురై గాయాలపాలయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నర్సంపేట ఏరియా దవాఖానకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే లక్ష్మారెడ్డి మృతి చెందినట్లు తెలిపారు. చేతికందివచ్చిన కొడుకు అకస్మాత్తుగా మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదన మిన్నంటింది. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్..


మంగి రవి(ఫైల్)

నెక్కొండ, మే 29 : భూపాలపల్లిలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న మండలంలోని చిన్నకొర్పోలు గ్రామానికి చెందిన మంగి రవి(34) అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. రవి కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. కానిస్టేబుల్ మృతితో చిన్నకొర్పోలులో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య పావని, మూడేళ్ల కుమారుడు ఆగస్త్య రాజ్, 15 రోజుల బాబు ఉన్నారు.

కళాకారుడికి పలువురి నివాళి

కరీమాఆబద్, మే 29 : అనారోగ్యంతో మరణించిన కళాకారుడు శతపతి శ్యామలరావుకు గురువారం పలువురు నివాళులర్పించారు. ఫోర్టురోడ్డులోని మృతుడి నివాసంలో మృతదేహానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మయూరి ఆర్ట్ క్రియేషన్స్ అధ్యక్షుడు కోటేశ్వర్, ప్రధాన కార్యదర్శి వేముల ప్రభాకర్, కోశాధికారి సత్యం, సభ్యులు ఆకుతోట లక్ష్మణ్, కళాకారులు పాల్గొన్నారు.

బస్సు కింద పడి మహిళకు తీవ్రగాయాలు

వరంగల్ చౌరస్తా, మే 29 : కదులుతున్న బస్సులో నుంచి దిగే ప్రయత్నంలో అదుపు తప్పి కిందపడిపోవడంతో మహిళ తీవ్రగాయాలపాలైన ఘటన వరంగల్ బస్టాండ్ ఆవరణలో చోటుచేసుకుంది. గురువారం సాయంత్రం జరిగిన ఈ ఘటనతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. కేసముద్రం మండలం చెరువుకొమ్ము తండాకు చెందిన జాటోత్ లక్ష్మి(60) తన భర్త వైద్య పరీక్షల నిమిత్తం హనుమకొండ లోని ఓ ప్రైవేట్ దవాఖానకు వచ్చింది. వైద్య పరీక్షలు పూర్తి చేసుకొని తిరుగు ప్రయాణం కోసం ఇరువురు వరంగల్ బస్టాండ్‌కు చేరుకున్నారు. అయితే, మహబూబాబాద్ డిపోకు చెందిన బస్సులోకి ఎక్కిన లక్ష్మి తన భర్త బస్సు ఎక్కకపోవడాన్ని గుర్తించి, కదిలే బస్సులో నుంచి దిగిపోయే ప్రయత్నం చేయడంతో అదుపుతప్పి వెనుక చక్రం కింద పడిపోయింది. ఈ ఘటనలో మహిళ ఎడమ కాలు నుజ్జునుజ్జయింది. వెంటనే ఆర్‌టీసీ అధికారులు, సిబ్బందితోపాటు ప్రయాణికులు స్పందించి 108కు సమాచారం అందించారు. రైల్వే స్టేషన్‌లోని 108 సిబ్బంది ఈఎంటీ కరుణాకర్, పైలట్ అమర్‌నాథ్ సకాలంలో స్పందించి ఘటనా స్థలానికి చేరుకొని, ప్రథమ చికిత్స అనంతరం ఎంజీఎం దవాఖానకు తరలించారు. మహిళ ఆరోగ్య స్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

భార్యను రోకలిబండతో కొట్టిన భర్త

కరీమాబాద్, మే 29 : వేరే అమ్మాయితో సెల్‌ఫోన్‌లో చాటింగ్ చేస్తున్న భర్తను ప్రశ్నించినందుకు భార్యను అతడు గురువారం రోకలిబండతో కొట్టాడు. ఈ ఘటన మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్ఆర్ఆర్‌తోటలో చోటు చేసుకుంది. ఎస్ఆర్ఆర్‌తోటకు చెందిన స్వాతికి ఆనందంతో వివాహం జరిగింది. అయితే, ఆనందం తరుచూ ఫోన్‌లో వేరే అమ్మాయితో చాటింగ్ చేయడం గమనించిన భార్య అనుమానంతో నిలదీసింది. దీంతో కోపంతో ఆనందం రోకలిబండతో భార్య తలపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను బంధువులు దవాఖానకు తరలించి చికిత్స చేయించారు. అనంతరం బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసభ్యకర వీడియో చేసిన ఒకరిపై కేసు

కరీమాబాద్, మే 29 : గణపతి విగ్రహంతో అసభ్యకరంగా వీడియోను తీసి, దాన్ని సోషల్‌మీడియాలో పోస్టు చేసిన వ్యక్తిపై గురవారం హిందూ వాహిని నాయకులు మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీడియో లింక్ ద్వారా ఏకశిలానగర్‌లోని గణపతి విగ్రహాల తయారీ కేంద్రంలో పని చేసే రమేశ్‌ను నిందితుడిగా గుర్తించి అతడిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సీడబ్ల్యూసీ, జేజేబీ నూతన కమిటీలను నియమించాలి

ఖిలావరంగల్, మే 29 : తెలంగాణ రాష్ట్ర మహిళా, శిశు, సంక్షేమం, వృద్ధులు, దివ్యాంగుల శాఖ ఆధ్వర్యంలో 33 జిల్లాల్లో సీడబ్ల్యూసీ, జేజేబీ నూతన కమిటీలను తక్షణమే నియమించాలని సామాజిక కార్యకర్త మండల పరశురాములు కోరారు. జువైనల్ జస్టిస్ చట్టం-2015 ప్రకారం మూడేళ్లకోసారి కొత్త కమిటీలను నియమించాలని పేర్కొన్నారు. 2024 ఫిబ్రవరిలో కమిటీల పదవీ కాలం ముగిసిన ప్పటికీ 15 నెలలుగా పాత కమిటీలు కొనసాగడం చట్ట విరుద్ధమని తెలిపారు. రాష్ట్రంలో అనేక మంది అర్హులైన అభ్యర్థులు వేచి ఉన్నారని, వారికి అవకాశం ఇవ్వాలని కోరారు.

'హెచ్ఎంలు ఒత్తిడికి గురి కావొద్దు'

కరీమాబాద్, మే 29 : ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు విధి నిర్వహణలో ఒత్తిడికి గురి కావొద్దని సైకాలజిస్టు, మోటివేటర్ డాక్టర్ బరుపాటి గోపి సూచించారు. ఉర్సులోని తాళ్ల పద్మావతి కళాశాలలో స్ట్రెస్ మేనేజ్‌మెంట్ , ఫ్యామిలీ మేనేజ్‌మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్‌స్కిల్స్ వంటి అంశాలపై జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ హెచ్ఎంలు ఒత్తిడిని జయించాలన్నారు. సమయపాలన పాటించి పనులను విడుతల వారీగా చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆయనను హెచ్ఎంలు సత్కరించారు.

సమన్వయంతోనే లక్ష్యాన్ని సాధించవచ్చు

డీఎంహెచ్‌వో సాంబశివరావు

వరంగల్ చౌరస్తా, మే 29: సమన్వయ పని విధానం ద్వారా మాత్రమే ఉత్తమ ఫలితాలను సాధించగలమని వరంగల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు అన్నారు. గురువారం జిల్లా పరిధిలోని పల్లె దవాఖానల వైద్యాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. విధుల నిర్వహణ, సమయపాలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. టీబీ సర్వేలో గుర్తించిన వివరాలను ఎప్పటికప్పుడు నిశ్చల్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రకాశ్, మాతాశిశు సంరక్షణ విభాగాధికారి డాక్టర్ అర్చన, డాక్టర్ ఆచార్య, జిల్లా ఏయిడ్స్ కంట్రోల్ మేనేజర్ స్వప్న పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సాంబశివరావు

దాతృత్వాన్ని చాటుకున్న ఎస్సై గోవర్ధన్

'నమస్తే' కథనానికి స్పందన

నల్లబెల్లి, మే 29 : వృద్ధ దంపతులకు ఆర్థికసాయం అందించి ఎస్సై గోవర్ధన్ తమ దాతృత్వం చాటుకున్నారు. కని, పెంచిన పిల్లలు కాటికి పోయారు. పని చేద్దామంటే సత్తువ లేదు. కాళ్లు చచ్చుబడి పోయి ఊరికి దూరమవుతూ కాటికి దగ్గరవుతున్న అభాగ్యులైన వృద్ధ దంపతుల దీన పరిస్థితిని ఈ నెల 28న 'వృద్ధ దంపతులకు ఆపద' శీర్షికతో 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది. ఈ మేరకు నల్లబెల్లి ఎస్సై గోవర్ధన్ స్పందించి వృద్ధులకు 50 కిలోల బియ్యంతోపాటు రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. వృద్ధులు కోరుకుంటే అనాథ ఆశ్రమంలో చేర్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు. లేకుంటే రేకుల షెడ్డు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, పోలీస్ సిబ్బంది మొగిలి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఆర్థికసాయం అందజేస్తున్న ఎస్సై గోవర్ధన్

టీజేఎఫ్ రజతోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

కరీమాబాద్, మే 29 : టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఈ నెల 31న హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ జర్నలిస్ట్ ఫోరమ్ రజతోత్సవం పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ గురువారం పెరుకవాడలోని ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నరేందర్ మాట్లాడుతూ జర్నలిస్టులకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మిట్ట నవనీత్, నీలం శివ, శ్రీనివాస్, బండి రవి, వెలిశాల పూర్ణచందర్, కమటం వేణుగోపాల్, అమీర్, ప్రభాకర్, కృష్ణ, హరినాథ్ పాల్గొన్నారు.

నియామకపత్రాల అందజేత

మానవ హక్కుల పరిరక్షణ కమిటీలో నూతనంగా నియమితులైన సభ్యులకు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులు విధులను బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న నన్నపునేని నరేందర్

మేలైన విత్తనాలతోనే దిగుబడి

ఖానాపురం, మే 29 : మేలైన విత్తనాలతోనే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని వరంగల్ ఏరువాక కోఆర్డినేటర్ దిలీప్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని రైతువేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దిలీప్ మాట్లాడుతూ రైతులు సమగ్ర పంట విధానాన్ని పాటించాలని సూచించారు. నేల ఆరోగ్యానికి తగిన పంటలను ఎంచుకోవాలన్నారు. శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ హరిబాబు, శాస్త్రవేత్త విశ్వతేజ పాల్గొన్నారు.

కొమ్మాలలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త సౌమ్య

ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించాలి

గీసుగొండ, మే 29 : ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ పంటలను సాగు చేస్తే దిగుబడి పెరుగుతుందని శాస్త్రవేత్తలు సౌమ్య, రాజు, గణేశ్ అన్నారు. గురువారం మండలంలోని పోతురాజుపల్లి, కొమ్మాల, మొగిలిచర్ల, చంద్రయ్యపల్లి, మనుగొండ, విశ్వనాథపురం గ్రామాల్లో మామునూర్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ శాఖ సహకారంతో విక్షిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు నూతన విత్తన వంగడాలు, వ్యవసాయంలో నూతన పద్ధతులను వివరించారు. రైతులు వ్యవసాయ సాగుతో పాటు పాడి పరిశ్రమలు, గొర్రెల పెంపకంపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో భారతీయ పరిశోధన మండలి శాస్త్రవేత్త కన్నుబాబు, రత్న కుమార్, రమేశ్, సురేశ్, ఏవో హరిప్రసాద్‌బాబు, ఏఈవో కార్య, ప్రత్యేక అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

దుగ్గొండి, మే 29 : కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్‌లకు రిజర్వేషన్లు అమలు చేయాలని మెపా వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో స్వామి అధ్యక్షతన జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో దేవేందర్ మాట్లాడారు. పాలకులు ముదిరాజ్‌లను ఓటు బ్యాంక్ గానే చూస్తున్నారని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రిజర్వేషను అమలు చేయకేంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తమ సత్తా చూపుతామని హెచ్చరించారు. సమావేశంలో మెపా నాయకులు పొన్నం రాజు, సంకెళ్ల స్వామి, దండు తిరుపతి, జెట్టబోయిన రాజేందర్, కుమార్, ముత్యం కిశోర్, చింతకాయల శంకర్, శివ, రాజు, నాగరాజు పాల్గొన్నారు.

'భయపెట్టి పాలిస్తున్న కేంద్రం'

వరంగల్ చౌరస్తా, మే 29 : దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి అడ్డొస్తున్నారని ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులు, ఆదివాసీలు, గిరిజనులను ఎన్‌కౌంటర్ల పేరుతో కేంద్రం హత్యలు చేస్తున్నదని ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి నర్ల చంద్రశేఖర్ ఆరోపించారు. గురువారం వెంకటరమణ జంక్షన్‌లోని ఎంసీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రజల దృష్టిని మరల్చి, భయభ్రాంతులకు గురిచేసి ప్రశ్నించే హక్కులను లాగేసుకోవాలని చూస్తున్నదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఆపరేషన్ కగార్‌ని నిలిపివేసి ప్రజల హక్కులను కాపాడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నకిలీ విత్తనాలు విక్రయించేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో లింగంపల్లి శ్రీనివాసరెడ్డి, మోర్తాల చందర్‌రావు, సింగతి సాంబయ్య, పానుగంటి నరసయ్య, మాదం తిరుపతి, మాడిశెట్టి అరుణ్‌కుమార్, తాటికొండ రవి, సంద గణేశ్, మాలోత్ రాజేశ్ నాయక్, పెద్ది సూరి, నాచారం శేఖర్, బాషిపాక బాబు పాల్గొన్నారు.

చెన్నారావుపేట సొసైటీ చైర్మన్‌గా వంశీ

చెన్నారావుపేట, మే 29 : చెన్నారావుపేట సొసైటీ చైర్మన్‌గా చింతకింది వంశీ గురువారం బాధ్యతలు చేపట్టారు. సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో డీసీవో నీరజ ఆదేశాల మేరకు వైస్ చైర్మన్‌గా ఉన్న వంశీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ పాలకవర్గం, అధికారుల సహకారంతో సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సత్యనారాయణరెడ్డికి నివాళులర్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు రాజు, రాంబాబు, రమాదేవి, పూల్ శంకర్, కవిత, గోపి, సరిత, సొసైటీ సీఈవో చిట్టె రవి పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రావొద్దు

మేయర్ గుండు సుధారాణి

వాల్వ్ పనులను పరిశీలిస్తున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్, మే 29 : తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మేయర్ గుండు సుధారాణి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం మట్టెవాడ పాఠశాలలో వాల్వ్ మరమ్మతు పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాల్వ్ మరమ్మతుల నేపథ్యంలో 11, 28, 29 డివిజన్లలో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. పదే పదే మరమ్మతులకు వస్తున్న వాల్వ్ స్థానంలో కొత్త వాల్వ్ వేయాలన్నారు. పాఠశాల ఆవరణలో వాల్వ్ ఉన్న నేపథ్యంలో విద్యార్థులకు ప్రమాదం జరుగకుండా ఇనుప గ్రిల్ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈలు ముజామిల్, హబీబ్, హెచ్ఎం అరుణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ లింగమూర్తి పాల్గొన్నారు.

మార్కెట్‌లో పలు టెండర్లు ఖరారు

కాశీబుగ్గ,మే 29 : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలోని పలు టెండర్లను గురువారం ఖరారు చేశారు. అధికారులు, టెండర్‌దారుల సమక్షంలో మార్కెట్ కమిటీ ఇన్‌చార్జి కార్యదర్శి జీ రెడ్యా సీల్ టెండర్లను ఓపెన్ చేశారు. పత్తియార్డులోని క్యాంటీన్‌కు ముగ్గురు పోటీ పడగా టీ శ్యాం నెలకు రూ.57,750తో దక్కించుకున్నారు. అలాగే, మార్కెట్ పరిధిలోని అన్ని యార్డులు కలి